# అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుటుంబానికి అండగా నిలిచిన పండ వరలక్ష్మి

**జనసేన సేవా స్ఫూర్తికి నిదర్శనంగా పండ వరలక్ష్మి సహాయం**



**రంపచోడవరం, పెన్ పవర్ జూలై 21:** బోలగొండ గ్రామపంచాయతీ పరిధిలోని చుప్పరిపాలెం గ్రామంలో అగ్నిప్రమాదంలో ఇల్లు కాలిపోయి సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి జనసేన పార్టీ అరకు పార్లమెంట్ సమాచార సేకరణ కమిటీ సభ్యురాలు పండ వరలక్ష్మి అండగా నిలిచారు. గ్రామ జనసైనికుల సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్న పండ వరలక్ష్మి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం మానవతా దృక్పథంతో బియ్యం బస్తా, కూరగాయలు అందజేయడంతో పాటు కొంత నగదు ఆర్థిక సహాయాన్ని అందించి, ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆపదలో ఉన్న కుటుంబాలకు తోడుగా నిలవడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రజలకు అవసరమైన సమయంలో జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ సీనియర్ నాయకులు కె. రవిబాబు, పి. పోతురాజు, పి. భాస్కర్, పి. రాజారెడ్డి, చుప్పరిపాలెం గ్రామ జనసేన నాయకుడు బి. అబ్బులు, వీర మహిళ అనురాధ పాల్గొన్నారు. అలాగే తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వై. కృష్ణమోహన్, మడకం రాజు, లండా ప్రవీణ్ కుమార్ హాజరై బాధిత కుటుంబానికి తమ సంఘీభావాన్ని తెలియజేశారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## గొంటువానిపాలెం లో ఘనంగా పొలం పిలుస్తోంది కార్యక్రమం...




**అడ్డతీగల, పెన్ పవర్, జూలై21;** అడ్డతీగల మండలం గొంటువానిపాలెం గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అడ్డతీగల సహాయ వ్యవసాయ సంచాలకులు సావిత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రైతులతో కలిసి వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంట వేసిన ప్రతి రైతు తప్పనిసరిగా, ఈ పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఏపీ ఏఐఎంఎస్ యాప్ ద్వారా యూరియా విక్రయం జరుగుతుందని, అడ్డతీగల మండలంలో దాదాపు 95 టన్నుల యూరియా నిల్వ ఉందని సావిత్రి తెలిపారు. మండల వ్యవసాయ అధికారి సి.హెచ్ శివ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో భాగంగా బీమా చేయించుకో దలచిన రైతు సోదరులు వరి పంటకు ఎకరానికి ప్రీమియం 646 రూపాయలు చెల్లించి నమోదు చేసుకోవాలని తెలిపారు దీనికి ఆఖరు తేదీ ఆగస్టు 15 అని తెలిపారు.

మొక్కజొన్న పంటకు 501 రూపాయలు ఎకరానికి చెల్లించాలని దీనికి ఆఖరు తేదీ జూలై 31 అని తెలిపారు.

పత్తి పంటకు ఎకరాకు 1923 రూపాయలు ఆఖరు తేదీ జూలై 31 అని,

ఈ విధానాన్ని సిఎస్సి సెంటర్ నందు గానీ బ్యాంకు నందు కానీ ఎన్సీఐపీ పోర్టల్ నందు గాని చేయించుకోవచ్చు అని వ్యవసాయ అధికారి శివ శ్రీనివాస్ తెలిపారు.

# సురక్షితమైన మంచినీటి సరఫరా కోసం 19 పరీక్షలు

**ఎమ్మెల్యే ఆదిరెడ్డి హెడ్ వాటర్ వర్క్స్ పరిశీలన**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 21:** నగర ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించడంలో 19 పరీక్షలు నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ స్పష్టం చేశారు. గోదావరిలోకి ఎర్రనీరు చేరుతున్న క్రమంలో హెడ్ వాటర్ వర్క్సను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి నాణ్యతపై అధికారులు పూర్తి అప్రమత్తంగా ఉన్నారని తెలిపారు. ప్రస్తుతం నీటికి 19 రకాల నాణ్యత పరీక్షలు నిర్వహిస్తూ సురక్షితమైన మంచినీటి సరఫరా కొనసాగిస్తున్నామన్నారు. అమృత్--2.0 పథకం నగరానికి శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని వెల్లడించారు. ప్రజలకు సరఫరా చేసే తాగునీటి నాణ్యతలో నిర్లక్ష్యం ఉండదన్నారు. భౌతిక పరీక్షలతో పాటు రసాయన పరీక్షలు కూడా నిర్వహిస్తూ నీరు పూర్తిగా సురక్షితంగా ఉందని నిర్ధారించిన తర్వాతే ప్రజలకు సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి నెలా నమూనాలను విశాఖపట్నంలోని రీజినల్ పబ్లిక్ హెల్త్ ల్యాబొరేటరీకి పంపి పరీక్షలు చేయిస్తు న్నామన్నారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి చెన్నైలోని మెటెక్స్ ల్యాబ్ కు పంపించి 52 రకాల అధునాతన పరీక్షలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ బహుళస్థాయి పరీక్షల ద్వారా నగర ప్రజలకు నాణ్యమైన, సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత రెండేళ్లలో నగరంలోని పాత డిస్ట్రిబ్యూషన్ పైప్‌లైన్లలో ఉన్న లీకేజీలను శాశ్వత పరిష్కారంగా అనేక ప్రాంతాల్లో కొత్త పైప్‌లైన్లు వేశామని చెప్పారు. పాత పైప్‌లైన్లను దశలవారీగా మార్చడంతో నీటి కలుషితాన్ని గణనీయంగా తగ్గిందన్నారు. అమృత్-- 2.0 పథకం కింద కేంద్ర ప్రభుత్వం, ఎంపీ పురందేశ్వరి సహకారంతో నగర తాగునీటి వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. కొత్తగా 20 ఎంఎల్డీ సామర్థ్యంతో నీటి వనరుల అభివృద్ధి, అదనపు ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లు (ఈఎస్ఆర్‌లు), కొత్త పైప్‌లైన్ల నిర్మాణం, పంపింగ్ వ్యవస్థల ఆధునీకరణ పనులు మూడు బృందాలతో వేగంగా కొనసాగుతున్నాయని చెప్పారు. ఈ పనులు పూర్తయితే క్వారీ ప్రాంతంతో పాటు నగరంలోని అనేక ప్రాంతాలకు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు. హెడ్ వాటర్ వర్క్స్‌లో పీరియాడిక్ నిర్వహణ కోసం సుమారు రూ.3.30 కోట్లతో ఆధునీకరణ పనులు చేపడుతున్నామన్నారు. వర్షాకాలంలో విద్యుత్ అంతరాయం ఏర్పడిన నీటి శుద్ధి, సరఫరా ఆగకుండా దవళేశ్వరం, కోట్లింగాల తదితర ప్రాంతాల్లో జనరేటర్లను ఏర్పాటు చేశామని వెల్లడించారు. తాగునీటి పైప్‌లైన్లలో లీకేజీలు కనిపిస్తే ప్రజాప్రతినిధులకు, అధికారుల దృష్టికి తీసుకురావాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం పార్టీ నాయకులు, అధికారులు ఆయన వెంట ఉన్నారు.



# నెట్‌వర్క్ సమస్యల పరిష్కారానికి టెలికాం సంస్థలతో ఐటిడిఏ సమీక్ష



**చింతూరు, పెన్ పవర్, జూలై 21:** గ్రామీణ, మారుమూల గిరిజన ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్, ఇంటర్నెట్ సేవలను మరింత మెరుగుపర్చేందుకు ఐటిడిఎ చింతూరు ప్రాజెక్ట్ అధికారి శుభం నోఖ్వాల్, ఆధ్వర్యంలో ఐటిడిఎ కార్యాలయంలో జియో, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్ టెలికాం సంస్థల ప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో మొబైల్ నెట్‌వర్క్ సేవల ప్రస్తుత పరిస్థితి, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై సవివరంగా చర్చించారు. తగిన మొబైల్ నెట్‌వర్క్ లేకపోవడం వల్ల విద్య, వైద్య, బ్యాంకింగ్, అత్యవసర సేవలు, ప్రభుత్వ ఆన్‌లైన్ సేవలను ప్రజలు సక్రమంగా వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని టెలికాం సంస్థల ప్రతినిధులు వివరించారు. దీనిపై స్పందించిన ప్రాజెక్ట్ అధికారి, నెట్‌వర్క్ సౌకర్యం లేని ప్రాంతాలను గుర్తించి అక్కడ కొత్త మొబైల్ టవర్ల ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భూములను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేసి త్వరితగతిన సమర్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా గ్రామీణ, మారుమూల ప్రాంతాల్లో నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలను అందుబాటులోకి తీసుకురావడంతో పాటు, 5జీ సేవలను దశలవారీగా విస్తరించేలా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని టెలికాం సంస్థల ప్రతినిధులకు సూచించారు. టెలికాం మౌలిక సదుపాయాల అభివృద్ధికి అవసరమైన అనుమతులు, భూకేటాయింపు లేదా ఇతర ప్రభుత్వ సహకారం అవసరమైతే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని, అవసరమైతే జిల్లా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన మొబైల్, ఇంటర్నెట్ సేవలు అందేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని, ప్రతి గ్రామానికి డిజిటల్ సేవలు చేరేలా సంబంధిత శాఖలతో సమన్వయంగా చర్యలు కొనసాగిస్తామని ప్రాజెక్ట్ అధికారి శుభం నోఖ్వాల్ స్పష్టం చేశారు.

# పచ్చదనం పెంపునకు ప్రతిన బూనుదాం

**కమిషనర్ రాహుల్ మీనా**



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, జూలై 21:** మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతిఒక్కరూ వ్యక్తిగత బాధ్యతగా చేపట్టాలని కమిషనర్ రాహుల్ మీనా పిలుపు నిచ్చారు. మంగళవారం గెయిల్ రోడ్డులో నగరపాలక అధికారులు, సిబ్బందితో కలిసి ఆయన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ప్రకృతిని ప్రేమించడం, ప్రకృతితో కలిసి జీవించడం మనిషి మనుగడ సరైన మార్గంలో ముందుకు సాగుతుందన్నారు. చెట్ల పెంపకం పర్యావరణ పరిరక్షణకు అవసరమని, ప్రతిఒక్కరూ మొక్కలు నాటడం ద్వారా జీవావరణాన్ని కాపాడలన్నారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు మొక్కలు నాటడాన్ని ప్రతీ పౌరుడు తన సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ఈ వర్షాకాలంలో రహదారుల వెంబడి వెయ్యి మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు రూపొందించి నట్లు చెప్పారు. మొక్కలు నాటడంతో భారీ ఉష్ణోగ్రత లను నియంత్రించ వచ్చని మొక్కలను నాటి వదిలే యకుండా, వాటిని సంరక్షించేలా బాధ్యత తీసుకోవాలన్నారు. నగరాన్ని కాలుష్యరహిత తీర్చిదిద్దాలన్న దృఢ సంకల్పంతో నగరపాలక సంస్థ ముందుకు వెళుతున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, వివిధ సంక్షేమ శాఖ వసతి గృహాల ఆవరణల్లో విరివిగా మొక్కలు నాటుతున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో ఏడీహెచ్ అనిత, డీఈ వెంకటలక్ష్మి, ఏఈ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.




# విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడి చదవాలి

**సైనింగ్ స్టార్ విద్యార్థులకు రూ.20 వేల ప్రైజ్‌మనీ, మెడల్స్, సర్టిఫికెట్ల అందజేత**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూలై 21:** విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణులై ఉన్నత లక్ష్యాలను సాధించాలని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సూచించారు. మంగళవారం రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన సైనింగ్ స్టార్ విద్యార్థులకు ప్రైజ్‌మనీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసే కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్, రంపచోడవరం ఎమ్మెల్యే, శాసనసభా లెజిస్లేటివ్ కమిటీ చైర్మన్ మిరియాల శిరీష దేవి, జిల్లా జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, జిల్లా రెవెన్యూ అధికారి పి. అంబేద్కర్ తదితరులు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా అభివృద్ధిలో విద్య కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచే చదువుపై దృష్టి సారించి కష్టపడి చదవాలని సూచించారు. పదో తరగతి అనంతరం తమకు నచ్చిన సబ్జెక్టులను ఎంచుకుని, భవిష్యత్తులో ఐఏఎస్, ఐపీఎస్, వైద్యులు, ఇంజనీర్లు, శాస్త్రవేత్తలు, న్యాయవాదులు వంటి వివిధ రంగాల్లో రాణించేలా స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. విద్యార్థినులను కూడా తల్లిదండ్రులు ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని కోరారు. పోలవరం జిల్లాలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన 52 మంది, ఇంటర్మీడియట్‌లో ప్రతిభ చూపిన 15 మంది కలిపి మొత్తం 67 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.20 వేల ప్రైజ్‌మనీ, మెడల్, సర్టిఫికెట్ అందజేశారు. ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. విద్యార్థులు ఉపాధ్యాయుల బోధనను శ్రద్ధగా విని మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు ప్రతి బాలిక 18 ఏళ్లలోపు వివాహానికి అంగీకరించకూడదని, ముందుగా విద్యను పూర్తిచేయాలని తెలిపారు. జాయింట్ కలెక్టర్ సురపాటి ప్రశాంత్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత మాట్లాడుతూ విద్యే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్లే ప్రధాన మార్గమని పేర్కొన్నారు. విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ కష్టపడి చదివి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని కోరారు. అనంతరం ముఖ్య అతిథుల చేతుల మీదుగా విద్యార్థులకు ప్రైజ్‌మనీ, మెడల్స్, సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, విద్యాశాఖ అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.






